నిర్ణయం

యస్.భాయాదేవి

ఎటోచూస్తూ కూర్చున్న రంగనాయకి యిటు కేసి తిరిగింది రజనీదేవి మాటలకు.

"నువ్వా రంగా, ఎవరో అనుకొన్నాను. అటుకేసి తిరిగి కూర్చుంటే" అంటోంది సంభ్రమంగా తనకేసే చూస్తూ.

రంగనాయకి రజనీదేవిని చూసి నవ్వింది. "అనుకోకుండా కలుసుకొన్నాం. కలుసుకొని చాలా రోజులైంది" అన్నది.

"రోజులేవిటి, సంవత్సరాలైతేనూ! నువ్వు పెళ్ళిచేసికొని వెళ్ళాక మళ్ళీ కలుసుకోలేదుగా! తరువాత కలుసుకోడం యిదే కద."

"రైలు ప్రయాణాలు ఎక్కడెక్కడి వాళ్ళని కలుపుతూంటాయి. చాలా లక్కీఫెలోని. ఇవాళ లేచిన వేళ చాలా మంచిది" అన్నది రజనీదేవి.

"అలాగా" అన్నట్లు నవ్వింది రంగనాయకి.

"మా వారు ఫస్ట్ క్లాస్‌లో వెళ్ళమన్నారు, థర్డ్ క్లాస్ ప్రయాణం తట్టుకోలేనని. ఎందుకైనా మంచిది, ఒంటిమీద నగలుకూడాను అని నేనే మొండికేసి థర్డ్ క్లాస్‌లో బయల్దేరాను. వారిమాట వినుంటె యివాళ మనకీ అవకాశమే లభించేది కాదు" అన్నది కళ్ళెత్తి ఆమెవంక చూస్తూ.

"ఉద్యోగం చేస్తున్నావా యిప్పుడు" అడిగింది రంగనాయకి ఏదో ఒకటి మాట్లాడాలన్నట్లు. ఒళ్ళోబాబు నిద్రలో జారిపోతూంటె పైకి లాగి ఒళ్ళో సమంగా పడుకోబెట్టుకొంది.

ఆమె వంకే చూస్తూ అడిగింది రజనీదేవి "ఎన్నోనెల?"

"ఏడాది దాటింది" నవ్వుతూ అంటున్న రంగనాయకి మాటలకు అడ్డుపడి అడిగింది రజనీదేవి తనూ నవ్వుతూ. "బాబుకు కాదు నీకు" అని.

"మూడు" నిర్వికారంగా సమాధానమిచ్చింది.

"నేను వుద్యోగం మానేశాను. వారు ఆఫీసరు, నేను గుమాస్తాని. వారి కది యిష్టంలేదు. వారికేవిటి, నాకూ యిష్టంలేదు. అందుకని మానేశాను. ఆ రెండొందలూ లేనంత మాత్రాన మాకు కూటికి లోటయ్యేదీలేదు. మా ఖర్చులకి వారి జీతం సరిపోతుంది. మిగతా అవసరాలకి ఆస్థి వుండనే వుంది ఎలాగో."

"మంచి పనిచేశావు. ఆరెండొందలే యింకెవరికన్నా కూడు పెట్టొచ్చు!" ఎటో చూస్తూ అన్నది రంగనాయకి.

"ఇంతకీ మీరెక్కడుంటున్నారు?" ముఖం మీద పడుతున్న వెంట్రుకలను సున్నితంగా వెనక్కు తోసుకొంటూ అడిగింది.

"హైదరాబాదులోనే" చూపులు తిప్పకుండానే అన్నది రంగనాయకి.

"మీవారు కూడా అక్కడే వుంటున్నారా?"

"నువ్వూ, మీవారూ ఒకచోట వుండటం లేదా ఏవిటి అలా అడుగుతున్నావు"

కంచరపాటును కప్పిపుచ్చుకొంటూ "అది కాదు నా ఉద్దేశ్యం; ఇద్దరూ వుద్యోగాలు చేస్తున్నారు కాబట్టి, అడిగాను. అంతకంటె వేరే వుద్దేశ్యమేమీలేదు" అన్నది రజనీదేవి.

"రాఘవ ఏం చేస్తోంది?" ఈసారి రంగనాయకి అడిగింది.

"మై గుడ్‌గాడ్! పెళ్ళియింది, తెలీదా? రీసెర్చి చేస్తున్నాడతను పూనాలో. పెళ్ళవంగానే అతని దగ్గరకు వెళ్ళిపోయింది. దాన్ని కూడా చదివిస్తున్నాడు. మొన్నా మధ్యవచ్చి

రెండు రోజులుండి వెళ్ళారు. బ్లూ ఇంపాలా-చాలా బావుంది. అది వాడే శారీస్ దిక్కు-మాలిన బెజవాడలో నాకు కావాలన్నా దొరకవు. వాళ్ళాయన అదిలేందే ఒక్క నిముషం వుండలేడట. ఏది కావాలంటె అది నిముషాల్లో తెచ్చిస్తాట్ట. మొన్నీమధ్య చేయించిన న్యూ మోడల్ నెక్లెస్ చూపించింది, ఎక్సెలెంట్‌గా వుంది. 'గ్రీన్‌శారి' వుందిట. ఐదు వందలపై చిలుకు ఎంతో చెప్పింది. దానికి సరిపోయేట్లు కొనుక్కొంది. ఈసారి వచ్చేటప్పుడు నాకూ అలాంటి శారీ ఒకటి రెడ్‌లో తెమ్మని చెప్పాను. పార్శెల్ చేస్తానంది. డబ్బిచ్చేశాను. తరువాత యివ్వొచ్చు లెమ్మంది కాని బలవంతాన యిచ్చేశాను. మావారు నీకు బ్లూ బాగుంటుంది, అలాంటిది కూడా ఒకటి తెప్పించమన్నారు. ఇదొచ్చాక అది తెప్పిస్తానన్నాను. మా వారికి డబ్బంటె లెక్కలేదు."

"అది ఈ అధునాతన సొసైటీ లక్షణం" అక్కడ ఆపి అన్నది రంగనాయకి.

"దానిదేముంది, మావారి సీనియర్ వున్నాడు. అవటానికి వారికంటె పెద్ద జీతగాడే. పైసా పైసాకు గీస్తాడు దిక్కుమాలిన పైసాయే గతిలేని వాడిలాగా."

"పైసాకు గతిలేని వాళ్ళు పైసా విలువ తెలిసి గీస్తారు."

"ఏమోగాని, మావారు ఫ్రీగా ఖర్చు చేస్తారు, నన్నూ చెయ్యమంటారు. డబ్బుకి గిలగిల లాడేవాళ్ళను చూస్తే నాకు పిటీ."

"ఏదన్నా సహాయం చేస్తావా?"

కిలకిలా నవ్వింది రజనీదేవి. "నా ఖర్చులే నాకు సరిపోతుంటాయి ఎప్పుడూ. క్లబ్బుకి వెళ్ళానంటె పాతిక రూపాయలు ఎందుకూ చాలవు" అంటోంది రజనీదేవి.

పెదిమలమీద నవ్వు మెరుస్తూండగా అంది రంగనాయకి.

"పిటీకి డబ్బు ఖర్చులేదు" అని.

"భలే మాటన్నావు" తనకేం పట్టనట్లు నవ్వేసింది రజనీదేవి. రైలువేగం తగ్గింది. "వరంగల్ వస్తున్నట్లుంది" అన్నది చేతి గడియారం చూసుకొంటూ. కంపార్టుమెంటులో వున్న నలుగురైదుగురు మనుషులు నిద్రపోతున్నారు. చల్లగాలి, హాయిగా వుంది.

నిద్రపోతున్న బాబు వీపుమీద చెయ్యివేసి నిమురుతూ కూర్చుంది రంగనాయకి.

"నీ మారేజ్ అవంగానే నా మారేజ్ అయింది. మావారు ఇప్పట్నుంచే పిల్లలెందు కంటారు, నాకూ అంతే; అందుకే మాకు యింకొక రెండేళ్ల దాకా ఆప్రసక్తిలేదు."

"దేశసేవ కాదన్నమాట."

"అలాంటి మాటలనకు. నాకు బోర్."

"నీకయినా అప్పుడే ఈ పిల్లలేమిటి, ఇలా అయితే ఈ అంద మెన్నాళ్ళు నిలుస్తుంది? అయినా మరీ అంత విరాగిలా కాస్త కుంకుమ, కాటుక మటుకు పెట్టుకొన్నావేం? నువ్వు కాస్త టాయిలెట్ అవుతే వైజయంతి, హేమమాలిని పోయి ఏ కొండల్లోనో దాక్కొంటారు. కాలేజీలో అంతాపడి చచ్చేవాళ్ళుకాదు నీ కోసం?—" నవ్వింది రంగనాయకి.

. "అది అందంగా కనపడాలన్న తాపత్రయం గలవాళ్ళకి. నాకా తాపత్రయంలేదు" అన్నది.

"దేవుడు అందాన్ని యిచ్చింది దాచుకోమనికాదు"

"మతులు పోగట్టమనా?" రజనీదేవి చూపుల్ని పట్టించుకోకుండా మళ్ళీ అన్నది.

"అలంకరణ యింకొంచెం మెరుగులివ్వవచ్చంతే. నాకసలా ధ్యాసవుండదు" జాలిగా చూసింది రంగనాయకి వంక రజనీదేవి.

రైలు వరంగల్ స్టేషన్లో ఆగింది. దిగేవాళ్ళు, ఎక్కేవాళ్ళుకూడా ఎక్కువ మందిలేరు.

రైలు కదలంగానే మళ్ళీ సంభాషణ మొదలెట్టింది రజనీదేవి.

"మీ వాళ్ళింటికి వెళ్ళొస్తున్నావా?"

"లేదు, మద్రాసు నుంచి వస్తున్నాను."

"అక్కడెవరున్నారు? మీ అన్నయ్యున్నారా? అక్కడికి ట్రాన్సఫరయిందా?"

"అన్నయ్య, అమ్మ అంతా కలసే వుంటున్నారు."

కొందరు ఎదుటి వాళ్ల మనసులో విషయం తెలిసినా తెలీనట్లు వాళ్ళు అడిగినంత మటుకు తుంచినట్లు సమాధానం చెప్తారు. దాంతోనే వస్తుంది చిక్కు--సూటిగా అడగలేని వాళ్లకి, అడగటానికి ధైర్యం లేనివాళ్లకి.

"మీ అత్తా రెక్కడుంటున్నారు?" మెళ్లో నెక్లెస్ సరిచేసుకొంటూ అడిగింది.

"వైజాగ్‌లో..."అసహనంగా రంగనాయకి వంక చూసింది-రంగనాయకి ఆమెకేసి చూడటం లేదు. తాను మద్రాసు ఇంటర్వ్యూకి వెళ్లొస్తున్నట్లు చెప్పలేదు. కాసేపు ఇద్దరి మధ్యా మౌనంగా గడిచిపోయింది. రైలు కాజీపేట స్టేషను సమీపించింది.

"మీల్స్, తీసుకొన్నావా?" రజనీదేవి.

"లేదు" అన్నది రంగనాయకి బయటకు చూస్తూ.

"తీసుకొందామా, ఆర్డరిస్తాను" తనూ బయటకు చూస్తూ అన్నది.

"నువ్వు తీసుకో, నేను కాఫీ తాగుతాను" అన్నది రంగనాయకి.

"ఒక్క కాఫీనే చాలా-చిప్స్, ఇంకేవన్నా ఆర్డరిస్తాను"

"కాఫీచాలు" స్టేషన్‌లోని సందడిని చూస్తూ జవాబిచ్చింది.

"పోనీ పోర్డ్ ఎగ్స్?" పరిశీలనగా చూస్తూ అన్నది.

"నా కలవాటులేదు."

"అదేం. అవీ యిప్పుడు శాకాహారమే కదా! తింటే తప్పేముంది?"

"థేంక్స్. నువ్వు తీసుకో...."తేలిగ్గా నవ్వి అన్నది రంగనాయకి. ఆమె చూపుల్లోని కోపం రజనీదేవి గమనించలేదు.

రైలు స్టేషన్‌లో ఆగింది. రజనీదేవి కళ్ళు ఎవరికోసమో వెతుకుతున్నాయి. లేచి సూట్ కేస్ అందుకొంది.

"ఇక్కడి వరకేనా నీ ప్రయాణం?"

"కాదు, కాదు. నాగపూర్‌కు. నా ఫ్రెండ్ వస్తానంది. తనతోబాటు వెడుతున్నాను. మళ్ళీ ఎప్పటికో కలయిక. గుర్తుంచుకొంటావు కదూ!" మృదువుగా రంగనాయకి చెయ్యి నొక్కింది.

"మనది మరచిపోయే స్నేహమా" అంటూ నవ్వింది రంగనాయకి.

"ఎగ్జాక్టిలీ కరెక్టు" మళ్ళీ ఒకసారి రంగనాయకి చెయ్యినొక్కి రైలు దిగింది.

రెండు నిముషాల్లో ఫ్రెండ్‌ని వెంటబెట్టుకు వచ్చింది. ఇద్దరూ కంపార్టుమెంటు లోపలకు వచ్చి కూర్చున్నారు.

"నా ఫ్రెండ్ సుచరిత-నాగపూర్‌లో రెక్చరర్" రంగనాయకికి పరిచయం చేసింది.

"రంగనాయకి-బి. ఏ. వరకూ కలసి చదువుకొన్నాం. తరువాత తను పెళ్ళిచేసుకు వెళ్ళిపోయింది." రజనీదేవి కళ్ళు నవ్వుతున్నాయి. సుచరిత గమనించలేదది.

"ఎక్కడుంటున్నారు మీరు?" రంగనాయకిని పల్కరించింది.

"హైదరాబాదులో. అక్కడే వారి వుద్యోగం నా వుద్యోగం కూడాను" నవ్వుతో సమాధానమిచ్చింది.

"అంటే — ఇంటికి వెడుతున్నారన్న మాట" అని "బాబు పేరేమిటి?" చిన్నగా బుగ్గ మీద చిటికేసి అడిగింది.

"రవి."

"సింపుల్" అన్నది. ఇంతలో ముగ్గురికీ కాఫీలు వచ్చాయి. కాఫీ తాగుతూ అడిగింది: "మీరు హైదరాబాదులో ఎక్కడ వుంటున్నారు?" అని.

"చిక్కడపల్లి."

"అక్కడ ఎక్కడో మా అక్కయ్యా వాళ్ళుండాలి. ఎంత ప్రయత్నించినా వెడదామంటే పడదు. ఎన్నాళ్ళనుంచో రమ్మంటోంది.ఏవిటో వుద్యోగంలోచేరేవరకూ అదొక వుబలాటం....చేరాక...." ఆపేసి నవ్వింది.

"అయినా హాయిగా మేరేజ్ చేసుకోక, నీకు ఉద్యోగం దేనికి? ఉద్యోగం లేకపోతే గడవదా ఏవిటి?" రజనీదేవి కాఫీ సాసరులోకి వంచుకొంటూ అన్నది.

"అవసరాన్ని బట్టి చేస్తూంటారు. అందరూ నీలాంటి వాళ్లే వుండరు" సుచరిత.

అర్థం కానట్లు చూసింది రజనీదేవి "నీ కంత అవసరమేమిటి, ఎవరన్నా వింటే నవ్వుతారు" అన్నది.

"నవ్వుకోనీయ్! తేరగా అందరికీ చేతనయింది అదే కదా!" సుచరిత జవాబు రజనీదేవికి నచ్చలేదని ఆమె ముఖాన్ని బట్టి తెలుసుకొన్నారు రంగనాయకి, సుచరిత.

ఒక నిముష మాగి, "రంగనాయకిది లవ్ మేరేజ్" అన్నది.

"లవ్ చెయ్యని వాళ్ళెవరు? పెళ్ళి ముందర చేస్తారు కొందరు, పెళ్ళయ్యాక చేస్తారు కొందరు. ఎప్పుడూ చెయ్యలేనివాళ్లు కూడా కొందరుంటారనుకో!" ఓరగా రజనీదేవిని చూస్తూ అన్నది సుచరిత.

"మీ వాళ్లు నీకోసం కూడా చూస్తున్నారని విన్నాను."

"వింతేముంది, ఆడపిల్లని-ఇది ఇండియా. ఎన్నాళ్ళని వూరుకొంటారు?"

"చూసుకోడానికి వచ్చారా ఎవరన్నా?"

"రానిస్తే వస్తారు."

"మరెందుకని రానివ్వక పోవడం?"

"సరి సరి. ఆవిడని పంపుదామని వచ్చి నా పెళ్ళి విశేషాలు మాట్లాడుకొంటూ కూర్చున్నాం. వీటికేం తొందరలేదు, మాట్లాడు కోవచ్చు!" అన్నది.

చిన్నబుచ్చుకొన్నట్లు అన్నది రజనీదేవి: "రంగనాయకి విషయం మరచిపోయాను" అని.

కాఫీ అమ్ముతున్న కుర్రాడొచ్చి కప్పులు, సాసర్లు, డబ్బు తీసుకెళ్ళాడు. రజనీదేవి పర్సు తీసి చిల్లర తీసే లోపల సుచరిత డబ్బు లిచ్చేసింది.

"నే నిచ్చేదాన్నిగా, నువ్వెందు కిచ్చావు" అన్నది సుచరితతో. ఫరవాలేదన్నట్లు నవ్వింది సుచరిత.

రైలు బయల్దేరబోతూంటే వాళ్ళిద్దరూ కిందికి దిగారు.

"బాబు లేచి ఏడిస్తే ఫ్లాస్కులో పాలు న్నాయా" చకచకా కిటికీ దగ్గరకు వచ్చి అడి గింది సుచరిత.

ఉన్నాయన్నది రంగనాయకి.

"మీవారు స్టేషనుకి వస్తారా?" అడిగింది రజనీదేవి.

"తెలీదు. ఎప్పుడూ వెళ్ళే హైద్రాబాదే కదా!" తేలిగ్గా నవ్వింది రంగనాయకి.

రైలు కూతేసి బయల్దేరింది. సుచరిత, రజనీదేవి ప్లాట్‌ఫారమ్ మీద నుంచుని చెయ్యి వూపుతున్నారు. రంగనాయకి కూడా వూపు తూంటే రైలు మెలిమెల్లిగా వేగాన్నందుకొని వెళ్ళిపోయింది.

"మనిషిని చూస్తే ఏవనిపించింది?" వైటింగ్ రూమ్‌కేసి దారితీస్తూ అన్నది రజనీ దేవి.

"స్త్రీని చూడగానే కలుగవలసిన గౌరవ భావం కలిగింది." అన్నది సుచరిత.

"అంతేనా, ఇంకేం అనిపించలేదా?" నవ్వు దాచుకొంటూ అడిగింది.

ఆమె వంక చూసి, సమాధాన మివ్వకుండా నడవసాగింది సుచరిత.

"లేచిపోయిందోయ్, లేచిపోయింది" తెరలు తెరలుగా నవ్వుతూ అంటోంది.

సుచరిత నుండి సమాధానం రాకపోవ డంతో నవ్వాగాక, "నా మాట విన్నావా" అని అడిగింది.

విన్నానన్నట్లు తలూపి, వైటింగ్ రూమ్ లోకి దారి తీసింది సుచరిత. సూట్‌కేస్ తెచ్చిన కూలీకి డబ్బు లిచ్చేసి పంపింది రజనీదేవి.

కుర్చీలో కూర్చుంటూ "మోసపోయిందా?" అని అడిగింది సుచరిత.

"లేచిపోయిందంటూంటే" తల కొట్టు కొని, ఇంకా వస్తున్న నవ్వుని బలవంతాన ఆపుకొని చెప్పడం మొదలు పెట్టింది:

"తండ్రికి బెజవాడలో రెండు పెద్ద మేడ లున్నాయ్! ఒక్కతే కూతురు. ఇంకా మొగ పిల్లలున్నారనుకో. యాభై వేలు కట్నమిచ్చి పెళ్ళి చెయ్యాలని ప్రయత్నం చేస్తున్నారు. అతని ఆస్తి చాలా వుంది. కట్టిన చీరె కట్ట కుండా, వచ్చిన ఫాషనల్లా కట్టేదీనికి చివరికి బుద్ధిలా పుట్టింది. అవన్నీ కాదని కాలదన్ని వీడితో యిలా లేచక్కా వచ్చింది."

"వాళ్ళు చెయ్యమన్నారా ఈ పెళ్ళి?"

"ఎలా చేస్తారు కంఠంలో వూపిరుండగా. కులంకాదు, అంతస్తుకి సరిపోడు, పైగా అతనూ బి.ఏ నే."

"చేసుకొనే వాళ్ళకి లేకపోయినా ఈ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్, ఈ సమాజాని కెక్కువ. వీళ్ళలో బతుకుతున్న వాళ్ళ కెక్క డిది సుఖం?" అన్నది సుచరిత.

"కావాలని చేసుకొన్నదానికి సుఖం రమ్మంటే మటుకు ఎక్కడినుంచి వస్తుంది. అనుభవించాల్సిందే చేసుకొన్నందుకు."

"అందరికీ జీవితంలో నగలూ, చీరెలూ, హోదాలూ వీటితోనే సరిపోదు. వీటన్నిటినీ మించి యింకొకటి వుంటుంది కోరుకొనేం దుకు."

"జీవితంలో మొదటి రోజుల్లో అంత మాత్రపు సంఘటనలు జరగకుండా ఎవరికుం టాయ్? వాటినే పట్టుకుని ప్రేమంటూ బతుకుని నాశనం చేసుకోడం మూర్ఖత్వం కాదూ!"

రజనీదేవి ముఖం ఎర్రబడి పోయింది.

సుచరిత మాట్లాడకుండా, చూస్తూ కూర్చుంది. ఒక నిముషమాగి మళ్ళీ మొదలు పెట్టింది రజనీదేవి.

"తమ అంతస్థుకి సరిపోయేవాడ్ని, తలి దండ్రులు చూసినవాడ్ని చేసుకోడం బుద్ధి మంతుల లక్షణమంటాను. ఇది ఇంట్లోంచి వెళ్ళిపోయి చేసుకొన్నందుకు యిటువాళ్ళు పల్కరించడం మానేశారు, అటువాళ్ళు పల్క రించడం మానేశారు.

"అతనయినా కొత్తల్లో బాగానే వుండే వాడులే. ఇప్పుడు ట్విన్ సిటీస్‌లో ఎవర్ని కదిపినా అతన్ని గురించి చెబుతారు. అతనికి పరిచయం లేని ఆడపిల్లలేదు. తన జీతమంతా ఏం చేస్తాడో తెలీదు. ఎదురీవిడ యివ్వాలి తన అలవాట్లకి. పెళ్ళికి ముందర రెండేళ్ళు కలిసి కొట్టారు షికార్లు."

శ్రద్ధగా వింటున్న సుచరిత "అందుకనే మోసపోయిందన్నాను" అన్నది.

ఛర్రుమన్నది రజనీదేవి. "మోసపోవడ మేమిటి, కళ్ళకి పొరలు కప్పుకు పోయాయే!"

"ఆమె కళ్ళు కప్పాడు జాగ్రత్తగా. రంగ నాయకి తెలివి తక్కువదికాదు, అమాయకు రాలుకాదు, అందుకే అతను తన రంగు బయటపడకుండా జాగ్రత్త పడ్డాడు. ఆమె స్త్రీ సహజంగా నమ్మిందతన్ని. నమ్మటం ద్రోహం కాదు, నమ్మించటం ద్రోహం."

"ఎవరికో ద్రోహం చేస్తే ఎవరూరు కుంటారు" మధ్యలోనే అందుకుంది సుచరిత.

"ఎవరికన్నా చెస్తే చూస్తూ వూరుకుంటారుకదూ. తమ కాలిగోరు చిట్లితే గుండె బద్దలయిపోతు న్నట్లు గోలపెడతారు. ఎదటివాడు గుండె బద్ద లయి ఏడుస్తున్నా మనకు పట్టదు. అదే పెళ్ళి తండ్రి చేసివుంటే అన్నివైపులనుంచి ఆమెకు పుష్కలంగా సానుభూతి, కొద్దో గొప్పో సహ కారం లభించి వుండేది. అతనికి నయానో, భయానో నచ్చజెప్పేందుకు ప్రయత్నించేవాళ్ళు. తమ మాట కాదందని 'అనుభవించనీ' అంటు న్నారు. తలిదండ్రులు చేసిన పెళ్ళిళ్ళలో ఎంత మంది మొగాళ్ళు బాధ్యలెరగకుండా ప్రవ

ర్తించడం లేదు, అప్పుడేమో 'దాని కర్మకి' వేదాంతం-ఇప్పుడు స్వయం కృతాపరాధం—అనుభవించనీ!"

"ఈ సంఘాన్ని కాదని ఎదిరించి చేసుకొన్నాక, ఇక వీళ్ళకేం అవసరం ఆవిడ గోడు పట్టించుకోడానికి? 'అనుభవించనీ' అనే అంటారు" నిర్లక్ష్యంగా తలెగరేసింది రజనీదేవి.

"ఆవిడ తన బతుకు గడపబోయేది మొగుడితో."

"ఇంకెవరితోనూ సరిపెట్టుకోలేదంటావే! మా రాఘవ నీకు తెలుసా? పెళ్ళికి ముందర మధుతో తిరిగింది. ఇప్పుడు పి. హెచ్. డీని పెళ్ళిచేసుకొని, హాయిగా జల్సాగా వుండటం లేదూ! ఛాన్స్ వస్తే రేపో, మాపో అతనితో ఫారిన్ కూడా వెడుతుంది. ప్రేమించని వాళ్ళుండరోయ్! మధు సవర్ణమే కూడాను. వాళ్ళ అంతస్థుకి సరిపోడని చేసుకోలేదు. రంగనాయకి మొగుడున్నాడంటె గుడ్డు లేని పూట కంచం తీసి ముఖాన కొడతాడట."

"అది వాళ్ళ స్వంతవిషయం. తన మనసుకి యిష్టమైతే వండి పెడుతుంది. అది మన కనవసరం" రజనీదేవి మాటల్ని ఆపేసి అన్నది సుచరిత.

ముఖం చిట్లించుకొంటూ అన్నది రజనీదేవి: "ఆనవసరం ఎలా అవుతుంది, అడ్డమైన కూడూ తింటూంటె" అని.

"ఎవరిష్టం వాళ్ళది. ఆవిడ తింటున్నానని నీకు చెప్పలేదుగా" అని "ఈ వివరాలన్నీ ఎక్కడ సేకరించావ్? ఏవన్నా ఏజంట్లని కాని పెట్టావా హైద్రాబాదులో" నవ్వుతో అన్నది సుచరిత.

ఆ మాట పట్టించుకోనట్లు "ఇష్టాలకైనా పరిమితి వుండాలి. ఇన్నాళ్ళబట్టి అతనికి వండి పెడుతూ, ఈవిడ యింకా మడి కట్టుకు కూర్చుందంటావా? ఇందాక 'ఎగ్స్' తీసుకొంటావా' అంటే అలవాటు లేదంది నిజమెంతోగాని. పొగరుమటుకు చావలేదు."

"నీ కిష్టంలేనివి, మీ ఆయన తింటూంటె నువ్వూ తింటావా?"

"మహామహా వాటికే తొణకని రంగనాయకి, ఈ కాస్తకి అబద్ధం చెప్పి తప్పించుకోదు" సుచరిత పెదవుల మీద నవ్వు మెరిసింది.



"పరువోయ్! పరువు" నవ్వింది రజనీదేవి.

"ఆ ముసుగులన్నీ నిజం ఒప్పుకోలేని వాళ్ళకి."

"అలా చెప్పుకోడం ఓ ఘనకార్యమంటావా?"

"ఘనకార్యమని కాదు, చెప్పుకోలేనిది చెయ్యడమెందుకని. నిజానికి ఈ పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న వాళ్ళందరూ చాటున చెప్పుకోలేనివి ఒకటో, రెండో చేసిన వాళ్ళే! వాళ్ళని పట్టి దండించిన వాళ్ళులేరు. రంగనాయకి లాంటి వాళ్ళు చేసింది దాచుకోవాలని మాత్రం ప్రయత్నించరు."

"రంగనాయకితో నీ పరిచయం కొద్ది నిముషాలు మాత్రమే. నాది సంవత్సరాలు" అని వానిటీ బేగ్ తెరచి డబ్బు లెక్కచూచుకోడం మొదలు పెట్టింది రజనీదేవి.

"మనిషిలోని మంచి గుణాలు తెలుసుకొనేందుకు కొద్ది నిముషాల పరిచయం చాలు. దుర్గుణాలు తెలుసుకొనేందుకు దీర్ఘకాలం కావాలి గాని."

తన డబ్బు గొడవలో పడింది రజనీదేవి.

కాసేపాగి అన్నది సుచరిత: "రంగనాయకి లాగే బాబు బాగున్నాడు" అని.

"సభ్యత లేకపోయినా సంతానం వుంది." రజనీదేవి పెదవులు వంకర తిరిగాయి.

"చదువుండీ—సంస్కారం లేనట్లు."

సుచరిత రజనీదేవి వంక చూడనూ లేదు, ఆవిడకు కోపం వచ్చిందని గమనించనూ లేదు.

"ఇంటికొచ్చేసరికి ఇంత వండిపెడుతుంది. తన సంపాదన అవసరం లేకుండా. అందుకే అతను రంగనాయకికి డైవోర్స్ యివ్వలేదు. ఇవ్వకూడదు, ఇవ్వకుండా యిలాగే ఏడ్పించుకు తినాలి" సుచరిత మీద కోపంకొద్దీ అరచింది రజనీదేవి.

"రంగనాయకి అందులోనే పరిష్కారం వెతుక్కొంటుంది. తనకు పూర్తిగా సరిపడదనుకొన్నప్పుడు తనే యిస్తుంది విడాకులు, ఎవరికోసం ఆగదు."

"ఇదేం అమెరికా అనుకొన్నావా?" రజనీదేవి కోపం సుచరితకు నవ్వు తెప్పిచ్చింది.

"మొగాడిస్తే ఇండియా, ఆడదిస్తే అమెరికానా?" అన్నది.

"ఇంతకీ నా పెళ్ళికి వస్తావా?" చటుక్కున గుర్తొచ్చినట్లు అడిగింది పెదవుల మీద చిరునవ్వుతో.

ఆశ్చర్యపోతూ అన్నది రజనీదేవి: "ఇంత వరకూ పెళ్ళి చూపులే అయినట్లు లేవు."

"అయి చాలారోజులైంది" ఆమె నవ్వు తికమకలో పెట్టింది రజనీదేవిని.

"ఏం చదివాడతను?" కనుబొమలు ముడిచి అడిగింది.

"బి. ఏ" అదిరిపడ్డది రజనీదేవి.

"అంటే—మీవాళ్ళు కుదిర్చిన సంబంధం కాదా?"

"కాదు—రంగనాయకి మార్గమే నాది కూడాను."

"నువ్వు ఎమ్మే."

"తెలుసు. అందుకే రంగనాయకి మార్గం అంటున్నాను. అలాంటి వివాహాలన్నీ విఫలం కావని నీకు చూపిస్తాను. నువ్వు చేసింది తప్పుకాదని, పరిస్థితిని ధైర్యంగా యెదుర్కోమని కూడా రంగనాయకికి తెలియబరుస్తాను" చెప్పుకుపోతోంది సుచరిత.

రజనీదేవి నిలకడగా కూర్చోలేకపోతోంది.

——o:o——